క్లుప్తంగా

'విజయకేతనం' రూపకల్పనకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వర రావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : 2026వ సంవత్సరంలో నిర్వహించే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులకు ఉపయుక్తమైన స్టడీ మెటీరియల్ విజయకేతనం రూపకల్పన నిమిత్తం శుక్రవారం డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఎ.సర్వేస్వరరావు వర్క్‌షాప్ నిర్వహించారు. విషయ నిపుణులైన వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు సుమారు 40 మంది పాల్గొని 2026 మార్చి పబ్లిక్ పరీక్షల్లో వచ్చే ముఖ్యమైన ప్రశ్నలు, బిట్స్‌పై చర్చించారు. విజయకేతనం రూపకల్పనకు ప్రణాళికలు తయారు చేశారు. సమావేశంలో విద్యాశాఖ ఏసీ జయలక్ష్మి, డీవైఈఓ ఎస్ రవీంద్ర భారతి, సుబ్బమ్మ దేవి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.కుటుంబ రావు తదితరులు పాల్గొన్నారు.

గురువులను మరువరాదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు ఎంత ఎదిగినప్పటికీ విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను మరువరాదని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి సూచించారు. స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 36వ స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు రిజిస్ట్రార్ చేతుల మీదుగా బంగారు, వెండి పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, కరస్పాండెంట్ మదర్స్ ఎర్నెస్టిన్ ఫెర్నాన్డేస్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీల రాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అండ్ పీజీ డైరెక్టర్ సిస్టర్ సుశీల, ఇంటర్మీడియట్ వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఫాతిమా డిగాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలను తొలగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులకు సర్వీసు పరమైన సమస్యలు పరిష్కరించాలని, ప్రశాంతంగా బోధించే పరిస్థితులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల పక్షాన కోరుతూ పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని, ప్లస్ టూ పాఠశాలలన్నింటినీ పాఠశాల విద్యాశాఖ పరిధిలో కొనసాగిస్తూ ఖాళీలను భర్తీ చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను పూర్తిగా తొలగించాలని కోరామని ఆంజనేయులు పేర్కొన్నారు.

నగరం.. దుర్గంధభరితం

- చినుకు పడితే ఏలూరు చిత్తడే!
- పొంగి పొర్లిన డ్రెయిన్లు
- రోడ్లపై ప్రవహించిన నీరు
- స్నేహ వారధిలో చేరిన నీరు
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- నగరపాలక సంస్థ నిర్లక్ష్యంపై విమర్శలు



స్నేహ వారధిలో వర్షపు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు



వంగాయగూడెం సెంటర్ నుంచి క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లే రహదారి దుస్థితి



ఫ్లైఓవర్ పక్క రోడ్డుపై పునరావృతమైన గోతులు



కండ్రిగగూడెం సంటర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు



ప్రభుత్వాసుపత్రి రోడ్డులో నిలిచిన మురుగు నీరు

ఏలూరు (టూటౌన్): కొద్దిపాటి వర్షానికే ఏలూరు నగరంలో డ్రెయిన్లలో మురుగు నీరు పొంగి పొర్లుతుంది. వీధులన్నీ బురద నీరు, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలన్నీ రోడ్లపైకి చేరి దుర్గంధం వెలజల్లుతుంది. ఇది గత రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షానికి నగరంలో నెలకొన్న దుస్థితి. రోడ్లు, కార్యాలయాలు, సెంటర్‌లు నీటితో నిండిపోయాయి. ప్రజలు భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. డ్రెయిన్ల నిర్వహణలో నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్ల ఛిద్రం

ఏలూరు 12 పంపుల సెంటర్, పవరుపేట సెంటర్, రైల్వేట్రాక్ రోడ్డు, పవరుపేట రైల్వే గేటు సెంటర్, శ్రీనివాస థియేటర్ రోడ్డు, ఎన్ఆర్‌పేట ఇలా ప్రతి రోడ్డుపైనా వర్షం నీరు పొంగి పొర్లింది. వంగాయగూడెం నుంచి క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లే రహదారి పూర్తిగా ఛిద్రమైంది. గోతుల్లో పెద్ద ఎత్తున వర్షం నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కండ్రిగగూడెం సెంటర్‌లో రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండి చెరువులను తలపించింది. మరో పక్క వ్యర్థాలు పెద్దఎత్తున రోడ్డుపైకి వచ్చి చేరాయి. నగరంలో గతంలో పూడ్చిన గోతుల్లో నుంచి కంకర పైకి లేచి రాళ్లు కనిపిస్తున్నాయి. ఆ గోతుల్లో వర్షం నీరు నిల్వ ఉండి వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

కార్యాలయాల ప్రాంగణాల్లో నీరు

వర్షం దెబ్బకు నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో నీరు చేరింది. స్నేహ వారధిలోకి నీరు చేరింది. ఆ నీటిలోనే వాహనచోదకులు రాకపోకలు కొనసాగించారు. జిల్లా ప్రభుత్వాసుపత్రి, కలెక్టరేట్ ముఖద్వారం, సెయింట్ థెరిస్సా కాన్వెంట్ గ్రౌండ్, కొత్త బస్టాండ్ ప్రాంగణం, జిల్లా పరిషత్ ప్రాంగణం ఇలా ప్రతి కార్యాలయం ఆవరణలోనూ వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

జనజీవనం అస్తవ్యస్తం

అల్పపీడన ప్రభావంతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి నగరంలోని సాధారణ జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లపై గోతుల్లో నీరు చేరి రాకపోకలకు వాహనచోదకులు నానా అగచాట్లు పడుతున్నారు. రోడ్లపై చిరు వ్యాపారాలు స్తంభించాయి. రైల్వే ట్రాక్ రోడ్డుపై వర్షం నీరు ప్రవహించడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వివిధ రకాల వ్యాపారులు తమ సరుకులను కాపాడుకోనేందుకు అష్టకష్టాలు పడ్డారు. తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారులదీ ఇదే పరిస్థితి.

గోతులు ప్రత్యక్షం



రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలోని రోడ్లన్నీ అస్తవ్యస్తంగా మారాయి. రాకపోకల సమయంలో వాహనచోదకులు గోతుల్లో పడుతున్నారు. కొద్ది నెలల కిందట పూడ్చిన గోతులు సైతం వర్షం దెబ్బకు మళ్లీ ప్రత్యక్షమయ్యాయి.

– బొల్లారపు నాగరాజు, గులాబీ తోట, ఏలూరు

డ్రెయిన్లు బాగు చేయాలి



వేసవిలో డ్రెయిన్లలో షిల్ట్ పూర్తిగా తీయకపోవడం వల్ల కొద్ది పాటి వర్షానికే మురుగు నీరు రోడ్లపైకి వస్తుంది. డ్రెయిన్ల ప్రక్షాళనలో నగరపాలక సంస్థ అలసత్వం వహించడం ప్రస్తుత పరిస్థితికి కారణం. వర్షాలు తగ్గిన తరువాతైనా డ్రెయిన్లు బాగుచేయాలి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఏలూరు

పేదల సంక్షేమమే పరమావధి



బిషప్ జయరావును అభినందిస్తున్న ఫాదర్ ఆరోను, నాగేశ్వరరావు తదితరులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పేదల సంక్షేమమే పరమావధిగా ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పలువురు ప్రశంసించారు. ఏలూరు పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించి 12 సంవత్సరాలు, గురుపట్టాభిషేకం జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బిషప్ జయరావు గురు పట్టాభిషేక వార్షిక మహోత్సవాన్ని ఏలూరు బిషప్ హౌస్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు పీఠం పరిధిలో కరోనా, వరదలు వంటి విపత్తుల సమయంలో పేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు, ఆర్థిక సాయం చేస్తూ పేదలను జయరావు ఆదుకుంటున్నారని వక్తలు కొనియాడారు. ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనతో జీవించేలా చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బిషప్ జయరావును సెయింట్ మైకల్ చర్చి ఫాదర్ దిరిశిన ఆరోను ఆధ్వర్యంలో నిర్మలగిరి పుణ్యక్షేత్రం నిత్య అన్నదాన ట్రస్ట్ కాంట్రాక్టర్ క్లే నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. నిర్మలగిరి పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్, ముప్పూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలి



ఖైదీలకు అందించే ఆహారాన్ని రుచి చూస్తున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఖైదీలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ జైలు అధికారులకు సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఆయన స్థానిక జిల్లా కారాగారాన్ని శుక్రవారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. ఖైదీల కేసుల వివరాలు, వాదించే న్యాయవాదుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా తనిఖీల్లో భాగంగా కారాగారాన్ని సందర్శించామన్నారు. ఆర్థికంగా వెనుకబడి, న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించి, కేసులను వాదించేలా చేస్తామని చెప్పారు. ఖైదీల కుటుంబ సభ్యులకు సమస్యలు ఏమైనా ఎదురైనా వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కారాగార పర్యవేక్షకులు సీహెచ్ఆర్‌వీ స్వామి, జైలర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు వాసి విశాఖలో మృతి

మృతుని నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



మీరపురెడ్డి రమేష్ (ఫైల్)

పెందుర్తి (విశాఖ జిల్లా) : పొట్ట చేత పట్టుకుని వలస వచ్చిన ఓ ఎలక్ట్రీషియన్ హార్ట్ ఎటాక్‌తో మరణించాడు. ఆ వ్యక్తి నేత్రాలను దానం చేసి, అతని కుటుంబం గొప్ప మానవత్వాన్ని చాటుకుంది. ఏలూరుకు చెందిన మీరపురెడ్డి రమేష్ (34) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. నెల రోజుల క్రితం పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలోని ఓ కంపెనీలో పనికి కుదిరాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని తన గదికి వచ్చిన రమేష్‌కు తీవ్రమైన గుండెపోటు రావడంతో పాటు ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మరణించాడు. ఈ క్రమంలో రమేష్ మృతదేహాన్ని తరలించేందుకు ఫ్రీజర్ బాక్స్ కోసం పెందుర్తిలోని స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు సంప్రదించారు. శ్రీనివాస్ చొరవ తీసుకుని, రమేష్ కళ్లు దానం చేసేలా కుటుంబ సభ్యులను ఒప్పించారు. రమేష్ తల్లి చంటమ్మ, సోదరుడు మహేష్ అంగీకరించడంతో, ఎల్‌వీ ప్రసాద్ సారథ్యంలోని మోషన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నగేష్ కార్నియాలను సేకరించి, ఆసుపత్రికి తరలించారు. రమేష్ కుటుంబ సభ్యుల మానవత్వంపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు





పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మ, సారె తీసుకొస్తున్న మహిళలు



శ్రీ మహా దుర్గ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహా సరస్వతి అమ్మవార్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కావడంతో మహిళా భక్తుల్లో హర్షాతిరేకలు వ్యక్తమయ్యాయి. శ్రావణమాసం ప్రారంభం తొలి శుక్రవారం శుభ సందర్భంగా ఏలూరు నగరంలోని వివిధ అమ్మవార్ల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి శ్రావణ మాస సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్లకు విశేష అలంకరణలు చేశారు. పత్తేబాద శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారికి వివిధ రకాల పండ్లతో విశేష అలంకరణ చేశారు. కోటదిబ్బ శ్రీ గణపతి త్రిదేవిపీఠంలో 120 మంది మహిళలు సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొత్తపేట 12 పంపులు సెంటర్‌లోని శ్రీ కనకదుర్గమ్మవారికి దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారికి 108 మంది మహిళా భక్తులచే 58 రకాల సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

కారుమూరి వాహనాన్ని అడ్డుకోవడం దారుణం

జంగారెడ్డిగూడెం: తణుకులో హరిహర వీరమల్లు సినిమా రిలీజ్‌లో బైక్ ర్యాలీ పేరుతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వాహనాన్ని జనసేన నాయకులు అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గురజాల పార్థసారథి చెప్పారు. కారుమూరి నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ కార్యక్రమంలోకి చొరబడి, ప్రచార రథంపైకి ఎక్కి హల్‌చల్ చేయడం సరికాదన్నారు.

సుభాష్ బాబుకు సన్మానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలు పైగా లయనిజంలో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ అనేక రూపాలలో సేవలు అందిస్తున్న హేలాపురి క్లబ్ సభ్యుడు పర్వతనేని సుభాష్ బాబు అమెరికాలోని ఓర్లాండ్‌లో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి ఏలూరు వచ్చిన సందర్భంగా శుక్రవారం ఆయన్ని ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు సుభాష్ బాబు నేతృత్వంలో ఈ జిల్లా, రెండు తెలుగు రాష్ట్రాల్లో మరెన్నో సేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాట్ ఏరియా లీడర్ ఎం ఉపేంద్ర, పూర్వపు జిల్లా గవర్నర్లు వి.మురళీ మోహనరావు, పి.విజయ భాస్కరరెడ్డి, కేవీ కిషోర్ కుమార్, లయన్స్ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములను సేకరించొద్దు

బుట్టాయగూడెం: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం గిరిజనులు సాగు చేస్తున్న భూములను సేకరించొద్దని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ, అందుగుల ఫ్రాన్సిస్‌లు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఇటీవల రెవెన్యూ అధికారులు భూసేకరణ చేస్తున్నారని చెప్పారు. వాటిలో ఎన్నో ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న ఎల్‌టీఆర్ భూములను కూడా సేకరిస్తున్నారని, వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకురాలు మొడియం నాగమణి, కారం ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్‌లను రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం: స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, కరెంట్ చార్జీలు తగ్గించాలని మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు రోడ్డు నుంచి మసీదు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జరిగిన సభకు మడకం కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా నాయకులు ఎం.నాగమణి, ఎ.శ్యామలరాణి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అత్యుత్సాహం చూపిస్తున్నారని, ఇప్పటికే ట్రూ అప్‌ఛార్జీలతో ప్రజలను బాదారని విమర్శించారు. కార్యక్రమంలో పి.హైమావతి, ఎం.జీవరత్నం , జి.వెంకట్రావు, ఎం.సుధారాణి, టి.ముత్యాలమ్మ, కె.వసంత, ఎం.సమ్మక్క, శ్రీదేవి, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బీన్లదిక్కుడు	100
వంకాయలు (తెలుపు)	32	చామదుంపలు	38
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	70	కంద	00
కాకర కాయలు	30	బీట్‌రూట్	38
బీరకాయలు	26	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	32	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	25-30	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	29
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలు



మహాసభల పోస్టర్ విడుదల మైఖేల్‌బాబు, ట్రస్టీలు

దెందులూరు : క్రియలు కలిగిన భక్తి అందరికీ ఆదర్శప్రాయమని, దేవునిపైన విశ్వాసంతో ఆయన ప్రపంచానికి నేర్పిన ప్రేమతత్వంతో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక అభివృద్ధితోనే మానవ జీవన విధానం పరిపూర్ణత చెందడంతో పాటు దేవుని దీవెనలు లభిస్తాయని గ్రేస్‌పవర్ మినిస్ట్రీస్ సెంట్రల్ చర్చి సువార్తికులు కొల్లి మైఖేల్ బాబు, మేరీగ్రేస్ అన్నారు. శుక్రవారం చొదిమెల్ల సమీపంలోని క్రీస్తు ప్రార్థన మందిరంలో రక్షణ సువార్త ఉజ్జీవ మహాసభలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాలు లక్ష్యంగా ఫ్రెండ్స్ లవ్ కేర్ చారిటబుల్ ట్రస్టుకు ట్రస్టు ఫౌండర్ చైర్మన్ కొల్లి మైఖేల్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రెజరర్‌గా మేకల శ్యామ్‌బెన్‌హర్, ట్రస్టీగా డాక్టర్ సేరా, బోర్డు డైరెక్టర్లుగా మంజుభార్గవి, సుకన్య నియమితులయ్యారు.

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ, టుగెదర్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 200 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం ఉచితగా నోట్ పుస్తకాలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రిన్సిపాల్ జీ.గిరిబాబు, స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేపీ స్టీవెన్ మాట్లాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఏరియల్ స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ, లయన్స్ క్లబ్ గేట్ అధ్యక్షుడు, కళాశాల సీడీసీ మెంబర్ ఎల్ వెంకటేశ్వరరావు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఫౌండర్ సురేష్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీం అబ్దుల్లాకి స్వాగతం

ఏలూరు (టూటౌన్): పాలస్తీనా ప్రజల విముక్తికి 41 సంవత్సరాల జైలు జీవితం అనుభవించి ఈ నెల 25న విడుదలవుతున్న విప్లవ యోధుడు జార్జెస్ ఇబ్రహీం అబ్దుల్లాకు విప్లవ స్వాగతం పలుకుతూ స్థానిక పాతబస్టాండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. నాడు పాలస్తీనా విముక్తికి పోరాడిన విప్లవ యోధుడు జార్జెస్ ఇబ్రహీం అబ్దుల్లా అని గుర్తుచేశారు. ఇప్టూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): సాంఘీక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జర్మనీ భాషలో శిక్షణ ఇచ్చి, ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కలిపించేందుకు నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ మహిళా నర్సింగ్ పట్టభద్రుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు వై.విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, రెండేళ్ల క్లినికల్ అనుభవం లేదా జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ల క్లినికల్ అనుభవం ఉండాలని, 35 ఏళ్ల వయసు మించరాదని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీలోపు ఏలూరు అమీనా పేట బాలయోగి సైన్స్ పార్క్ వద్ద గల సాంఘీక సంక్షేమ సాధికారత వారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 97047 82803, 95022 28533లో సంప్రదించాలని కోరారు. తిరుపతి, గుంటూరు, విశాఖపట్నంలో జర్మన్ భాషపై 8 నెలలు శిక్షణ ఇవ్వనున్నామని ఆయన తెలిపారు.

అపరిశుభ్ర పరిసరాలే వ్యాధులకు మూలం

భీమడోలు: అపరిశుభ్ర పరిసరాలే వ్యాధులకు మూలమని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని భీమడోలులో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. నీటి కలుషితంతో టైఫాయిడ్, అతిసారం, కామెర్లు వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం వస్తే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు మురళి, చందూ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ నికితశ్రీ, కనకరత్నం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.